క్లుప్తంగా

విద్యార్థుల కోసం తొలిమెట్టు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: విద్యార్థుల కోసం తొలిమెట్టు ఏర్పాటు చేశామని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. తొలిమెట్టులో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆటపాటలతో సృజనాత్మకతతో కూడిన పద్ధతులతో వారంకొకసారి బోధన చేయాలన్నారు. దీంతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో విద్యార్థుల్లో గుణాత్మక మార్పులను పెంపొందించడం కోసం విద్యార్థులకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లారం శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ పడాల తిరుపతి, జమున, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

'యాదవుల జోలికొస్తే ఊరుకోం'



లక్ష్మణ్ యాదవ్

బుగ్గారం: యాదవ కులస్తులను అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ పార్టీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని యాదవ హక్కుల పోరాట సమితి బుగ్గారం మండల యువజన శాఖ అధ్యక్షుడు పంచిత లక్ష్మణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించిన అడ్లూరి యాదవుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తి ఇలాంటి అసభ్యకరమైన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. అడ్లూరి వ్యాఖ్యలను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యాదవులంతా ఐక్యతతో ఉండి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు.దీనిపై యాదవులంతా స్పందించాలని కోరారు. తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా ఊరుకోబోమని హెచ్చరించారు.

నిరుపేద కుటుంబానికి సాయం



నిత్యావసర సరుకులు ఇస్తున్న క్లబ్ సభ్యులు

బుగ్గారం: మండల కేంద్రంలోని ఓ నిరుపేద కుటుంబానికి అలయన్స్ క్లబ్ అండగా నిలిచింది. బుగ్గారం గ్రామానికి చెందిన శంకరయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. శంకరయ్యకు భార్య జమున, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబ పరిస్థితిని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న అలయన్స్ క్లబ్ సభ్యులు కొత్త మోహన్, తాళ్ళపల్లి సురేందర్‌గౌడ్ తమ సంస్థ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం,నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రహమాన్, తడిచర్ల శంకర్, నగునూరి శేఖర్, అబ్దుల్ అజీజ్, లక్కం నరేందర్, కొడిమ్యాల తిరుపతి, నక్క మహేశ్ పాల్గొన్నారు.

కోరుట్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుట్ల: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోరుట్ల కోటి నవ దుర్గ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 96 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో 35 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరం కాగా, వారిని రేకుర్తి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో రేకుర్తి కంటి ఆస్పత్రి చైర్మన్, వైస్ చైర్మన్ లయన్ కొండా వేణుమూర్తి, లయన్ చిదుర రమేశ్, కోరుట్ల లయన్స్ క్లబ్ చైర్మన్ వనపర్తి చంద్ర మోహన్, కార్యదర్శి కుందారపు మహేందర్ కోశాదికారి కృష్ణా జిల్లా నాయకులు గుంటుక చంద్ర ప్రకాశ్, వడ్డెపల్లి శ్రీనివాస్, అల్లాడి శోభ, అల్లాడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలేవి?

- మిషన్ భగీరథ నీళ్లు ట్యాంకులకు రాక నల్లా నీళ్లు బంద్
- నీటి కోసం ఇబ్బందిపడుతున్న ప్రజలు
- బోరుబావుల నుంచి ట్యాంకులు నింపాలంటున్న ప్రజలు

కథలాపూర్: మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో చిన్న సమస్య వచ్చినా రోజుల తరబడి నీళ్లు రాని పరిస్థితి కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నెలకొంది. మండలంలోని గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం నుంచి పైపులైన్ ద్వారా నీళ్లు చేరుతాయి. అగ్రహారంలో మోటార్ల సమస్య, విద్యుత్ సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయంగా గ్రామాల్లోని బోరుబావుల ద్వారా ట్యాంక్‌ల్లోకి నీళ్లు అందించాల్సి ఉండగా వాటి గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ట్యాంక్‌లకు ఉన్న పైపులైన్‌ను మరమ్మతు చేసిన నీళ్లందించవచ్చని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

36 నీటి ట్యాంకులు.. 12 వేల నల్లా కనెక్షన్లు

మండలంలో 19 గ్రామాలుండగా.. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ పైపులైన్ వేసి సుమారు 12 వేల నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. 19 గ్రామాల్లో ప్రజలకు నీటిని అందించేందుకు 36 రక్షిత మంచినీటి ట్యాంకులను నిర్మించారు. ఈ ట్యాంక్‌ల్లోకి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం నుంచి పైపులైన్ ద్వారా నీళ్లు వచ్చేలా ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ పథకానికి ముందు ఈ ట్యాంక్‌ల్లోకి ఆయా గ్రామాల్లోని బోరుబావుల ద్వారా నీటిని సరఫరా చేశారు. మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాత పైపులైన్ గురించి పట్టించుకోకపోవడంతో అగ్రహారం నుంచి నీళ్లు రాకపోతే గ్రామాల్లో నల్లా నీళ్లు రాని పరిస్థితి. ఫలితంగా పలు గ్రామాల్లో ప్రజలు వారం రోజులు నీటికోసం తీవ్ర ఇబ్బందులపాలైన సంఘటనలున్నాయి.

నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలివే..

మండలంలోని భూషణరావుపేటలో 90 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ ఉన్నప్పటికీ మిషన్ భగీరథ పథకం నీళ్లు రాకపోతే నల్లా నీళ్లు రావడంలేదని ప్రజలు తెలిపారు. ఒక్కోసారి 15 రోజులపాటు నల్లా నీళ్లు రాలేదని స్థానికులు పేర్కొన్నారు. గ్రామశివారులోని బోరుబావి నుంచి ప్రత్యామ్నాయంగా పైపులైన్ వేస్తే సమస్య తీరుతుందన్నారు. ఇప్పపెల్లిలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో నల్లా నీళ్లు రావడంలేదు. గ్రామస్తులు ఆయా వాడల్లోని బోరుబావులతో నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఊట్‌పెల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల నల్లా నీళ్లు రావడంలేదని స్థానికులు పేర్కొన్నారు. పెగ్గెర్లలో పైపులైన్ లీకేజీల వల్ల పలు వాడలకు మిషన్ భగీరథ పథకం నీళ్లు రావడంలేదని తెలిపారు. మిగతా గ్రామాల్లోనూ ట్యాంకులకు ప్రత్యామ్నాయంగా కొత్త పైపులైన్ వేస్తే నీటి సమస్య తీరుతుందని ఆయా గ్రామాల నాయకులు అంటున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపి కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ ప్రతీరోజు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



భూషణరావుపేటలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

పట్టించుకునే వారే లేరు



మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి నల్లా నీళ్లు ఇస్తున్నామని చెప్తుండ్రు. గత నెలలో అగ్రహారం నుంచి నీళ్లు రావడంలేదని 15 రోజులుగా మా వాడకు నల్లా నీళ్లు బంద్ చేసిండ్రు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పిన పట్టించుకోలేదు. ప్రతీ ఒక్కరికి రోజు నీళ్లు అవసరం. అలాంటిది నీటి సరఫరాపై నిర్లక్ష్యం చేయడం బాధకరం. పెద్ద ట్యాంక్‌లోకి నీళ్లు వచ్చేలా బోరుబావి, పైపులైన్ ఏర్పాటు చేసి నీళ్ల సమస్య తీర్చాలి.

– ఊశకోల రాము, భూషణరావుపేట

బోరుబావులే దిక్కవుతున్నాయి



ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తున్నామని చెప్తున్న మాటలు దేవుడికే గుర్తు. మా గ్రామంలో నల్లా నీళ్లు రాక చాలా రోజులవుతోంది. ఆయా వాడల్లోని బోరుబావులతో నీళ్లు ఇళ్లలోకి వాడుకుంటున్నాం. నీటి సమస్య గురించి ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడం దారుణం. మిషన్ భగీరథ పైపులతో ట్యాంకులు నింపి ఇంటింటికీ నల్లా నీళ్లు అందించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గంద్ర విజయ్‌రావు, ఇప్పపెల్లి

పంచాయతీలదే బాధ్యత



మిషన్ భగీరథ పథకంలో అన్ని గ్రామాల్లోని ట్యాంకులకు నీళ్లు సరఫరా చేస్తున్నాం. మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీలే నీటి సరఫరా గురించి చర్యలు తీసుకోవాలి. అవసరమైతే గ్రామపంచాయతీలు పాత పైపులైన్‌ను మరమ్మతులు చేయించి ట్యాంకుల్లోకి నీళ్లు వచ్చేలా ఏర్పాటు చేయాలి. దీని కోసం ఆయా పంచాయతీ పాలకవర్గాలు చొరవ తీసుకోవాలి.

– చంద్రశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కథలాపూర్

ఎన్నికలచ్చినయ్.. ఓటర్లకు మర్యాద తెచ్చినయ్

పెగడపల్లి: ఇన్నాళ్లు పలకరించినా చూడని నాయకులు, ఇప్పుడు ఎక్కడ లేని మర్యాద చూపిస్తుండ్రు. తమ్మీ, అన్న అంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నరు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో తమ అభ్యర్థి తరఫున ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు పాత పరిచయాలను గుర్తు చేసుకుంటూ ఓట్లు ఆకర్షించే ప్రయత్నం మస్తుగా జేస్తుండ్రు. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్న విషయం తెల్సిందే. అభ్యర్థులతో పాటు వారి ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు కలిసి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎక్కడా లేని ప్రేమను ఒలకపోస్తుండ్రు. రచ్చబండ వద్ద, కూడళ్ల వద్ద కలిస్తే చాలు పార్టీ సేవలను, తమ నాయకుల గొప్పలను ఊదరగొడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే చాలు, తెల్లవారే వరకు ఆ ఇంట వాలిపోయి విషణ్ణ వదనాలు పెడుతుండ్రు. ఈ ఎన్నికల మర్యాద ఓట్లు వేసేంత వరకే గదా? అంటూ జనం ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

విద్యార్థినులకు అభినందన



సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైన విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి 31వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 4 న జగిత్యాలలో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులు జి. ప్రవంతి, దీక్షిత ఎంపికయ్యారు. వారిని జిల్లా విద్యాధికారి జగన్మోహన్, సైన్స్ ఆఫీసర్ బాజోజి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుజాత సుకుమార్ తదితరులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



సత్తక్కపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు



జైనాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారి

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీటీసీఎస్ ఉమాపతి అన్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్,ఆత్మకూర్, సత్తక్కపల్లి గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం విమోచన, సీసీలు అశోక్, వెంకటరమణ, శ్రీనివాస్, పురుషోత్తం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్మపురి: మండలంలోని జైనా, దొంతాపూర్, ఆరెపెల్లి, మగ్గిడి గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రత్యేక అధికారి రాములు ప్రారంభించారు. మాశ్చర్ వచ్చాక ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో ధరణి, సీఈవో సాగర్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

మెట్‌పల్లి: తరుగు లేకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి కోరారు. సోమవారం మెట్‌పల్లిలో మాట్లాడారు. ప్రతి సీజన్‌లో క్వింటాల్‌కు ఐదు నుంచి పది కిలోల వరకు కోత పెట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఈ సీజన్ నుంచి తరుగు లేకుండా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు.

చిత్ర కథ | ప్రజాధనం వృథా..



మెట్‌పల్లి: ఈ చిత్రంలో కనిపిస్తున్న షెడ్లు పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్నాయి. రోడ్డుపైన విక్రయాలు జరిపే చిరు వ్యాపారుల కోసం సుమారు రూ.5 లక్షల మున్సిపల్ నిధులు వెచ్చించి రెండేళ్ల క్రితం వీటిని నిర్మించారు. కానీ ఇంతవరకు వాటిని వినియోగించడం లేదు. ఈ షెడ్లు పట్టణ శివారులో ఉండడంతో అక్కడ వ్యాపారాలు అంతగా సాగవనే అభిప్రాయం ఉంది. ఈ కారణంతోనే వ్యాపారులు ముందుకు రావడం లేదని తెలిసింది. అధికారుల అనాలోచిత చర్య వల్ల ప్రజాధనం వృథా అయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటరు అవగాహన ర్యాలీలో అధికారులు

కోరుట్ల: ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. పట్టణంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో మహిళా సంఘాల ఆధర్యంలో ర్యాలీ నిర్వహించారు మెప్మా భవనంలో అవగాహన కల్పించారు. సీవిజిల్ యాప్‌పై వివరించారు. కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్, డీఎంసీ సునీత, ఇన్‌చార్జి టీఎంసీ సంధ్య, సీవో శివ, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ సమస్యల పరిష్కారానికి కృషి

ధర్మపురి: ట్రాక్టర్ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు లశెట్టి మహేశ్ అన్నాడు. ధర్మపురిలో సోమవారం మాట్లాడుతూ యూనియన్ కార్మికులకు అందించిన సేవలకు గుర్తింపుగా ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. ట్రాక్టర్ యూనియన్ కార్మికులకు ఎల్లా వేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నాడు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంపంగి రవి, వీరవేణి కొమురయ్య, కాశవేణి సాయిలు, అయ్యోరి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ శత చండీయాగం

జగిత్యాలటౌన్: బ్రహ్మశ్రీ తిగుళ్ల విషుశర్మ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో సాగుతున్న శత చండీయాగం సోమవారానికి మూడో రోజుకు చేరింది. 60 మంది పురోహితులు పాల్గొని యాగ క్రతువు నిర్వహించారు. ఈ నెల 9 వరకు కొనసాగనున్న శత చండీయాగంలో వేద పఠనం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తి పాట చిత్రీకరణ

రాయికల్: డంకర డంక శివుని పాట షూటింగ్‌ను రాయికల్ పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు కొబ్బరికాయ కొట్టి క్లాప్ కొట్టారు. కార్యక్రమంలో దర్శకుడు కొమురవెల్లి చిరంజీవి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి, యూనిట్ సభ్యులు హరీశ్‌పటేల్ పాల్గొన్నారు.

ఆపన్నులకు సాయమందించే సామాజిక వేదిక



సంబురాలు జరుపుకుంటున్న సభ్యులు

మల్యాల: మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం స్నేహితులతో కలిసి 'నా వాట్సాప్ నా ఇష్టం' పేరిట సోషల్ మీడియా గ్రూపు రూపొందించి, ఆపన్నులకు సహాయం చేస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. గ్రూపు ఏర్పాటు చేసి ఐదేళ్లు గడుస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం రాత్రి కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని ఈ గ్రూపు ద్వారా కరోనా కాలంలో ఎంతో మందికి ఆర్థిక సాయం తోపాటు, నిత్యావసర సరుకులు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, మహేశ్, సత్యం, సంతోష్, పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా ప్రమాణాల పటిష్టతకు కృషి చేయాలి

మెట్‌పల్లి: పాఠశాలల్లో ప్రాథమిక విద్యా ప్రమాణాల పటిష్టతను పెంచడానికి జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నియమించిన వలంటీర్లు కృషి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్ సూచించారు. కళాశాలలో సోమవారం వలంటీర్ల నియామకానికి సంబంధించిన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో ప్రాథమిక స్థాయి విద్యా ప్రమాణాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడానికి ప్రత్యేకంగా వలంటీర్లను ఎంపిక చేస్తోందన్నారు. ఎంపికైన వలంటీర్లు ప్రతి శనివారం ఒక గంట పాటు వివిధ నైపుణ్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వెంకయ్య, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

పారుడు వ్యాధి నివారణకు టీకాలు



గొర్రెలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మెట్‌పల్లిరూరల్: గొర్రెలు,మేకల్లో పారుడు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి నరేశ్ తెలిపారు.సోమవారం మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటలో గొర్రెలు,మేకలకు పశువైద్యాధికారులు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల పైబడిన గొర్రెలు,మేకలన్నింటికీ టీకాలు వేయించాలన్నారు. అనంతరం బండలింగాపూర్‌లో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద మంజూరైన గొర్రెల షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మనీషా,సిబ్బంది రవీందర్,మురళి,మోహన్,దిలీప్ పాల్గొన్నారు.